క్లుప్తంగా

కుమారస్వామికి పూజలు


ప్రత్యేక పూజల అనంతరం కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేక, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్య స్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

కానిస్టేబుల్‌కు సన్మానం


పీసీ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న ఎస్‌ఐ రామ్మోహన్ రెడ్డి, సిబ్బంది

మహానంది: మహానందీశ్వర స్వామి దర్శనానికి వచ్చిన కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ పట్టణానికి చెందిన కుటుంబ సభ్యులు తమ రెండేళ్ల చిన్నారిని కారులో ఉంచి వెళ్లిన విషయం తెలిసిందే. ఊపిరి ఆడక కొట్టుమిట్టాడుతున్న బాబును గుర్తించిన మహానంది కానిస్టేబుల్ చంద్రశేఖర్ కారు అద్దాలను పగలగొట్టి సమయస్ఫూర్తితో కాపాడాడు. దీంతో కానిస్టేబుల్ చంద్రశేఖర్‌ను మంగళవారం మహానంది ఎస్‌ఐ రామ్మోహన్ రెడ్డి, ఏఎస్‌ఐ మౌలాలి, సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఓబులేసు పాల్గొన్నారు.

కూలిన భారీ వృక్షం


రోడ్డుపై కూలిన భారీ వృక్షం

మహానంది: వరుసగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో గోపవరం గ్రామంలో ప్రధాన రహదారిపై సోమవారం రాత్రి భారీ వృక్షం నేలకూలింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మంగళవారం ఉదయం వరకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో గ్రామస్తులు అవస్థలు పడాల్సి వచ్చింది. విద్యుత్ ఏఈ ప్రభాకర్ రెడ్డి సిబ్బందిని పంపించి యథావిధిగా విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయించారు.

అలరించిన నృత్యప్రదర్శన


నృత్య ప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై కడపకు చెందిన ఎస్.నటరాజ డ్యాన్స్ అకాడమీ వారి సంప్రదాయ నృత్యప్రదర్శన అలరించింది. మహాగణపతిం, శివపార్వతి కల్యాణం, శివతాండవం, ఆనందతాండవం, మహిషాసురమర్దిని తదితర గీతాలకు చిన్న, జయశ్రీ, క్రాంతికుమార్, గణేష్, యోగి తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ


ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ, ఎస్‌ఐ

జూపాడుబంగ్లా: ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ ప్రాణాలకు రక్షణగా ఉంటుందని నందికొట్కూరురూరల్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పిస్తూ మంగళవారం జూపాడుబంగ్లా ఇన్‌చార్జ్ ఎస్‌ఐ తిరుపాలు, సిబ్బందితో కలిసి స్థానిక పోలీసుస్టేషన్ నుంచి బస్టాండు వరకు సీఐ ద్విచక్రవాహనాలతో ర్యాలీ నిర్వహించారు.

పింఛన్ నిలిపివేత


మంచానికే పరిమితమైన ఈశ్వరరెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంటలోని పాత సున్నిపెంటలో నివాసం ఉంటున్న 78 ఏళ్ల చిలకల ఈశ్వరరెడ్డికి ఈనెల పింఛన్‌ను ప్రభుత్వం నిలిపేసింది. 15 ఏళ్లుగా వృద్ధాప్య, 7 ఏళ్లుగా పక్షవాతం పింఛన్ పొందుతున్నాడు. వృద్ధాప్యం, పక్షవాతం కారణంగా 6 నెలలుగా పూర్తిగా మంచానికి పరిమితమయ్యాడు. నంద్యాలలో సదరం క్యాంపునకు హాజరు కాలేదని, ఈకేవైసీ చేయించుకోలేదనే కారణంతో పింఛన్‌ను నిలిపేశారు.

జగనన్న కాలనీలో వసతులు కరువు!

- రోడ్లు, వీధి లైట్లు లేక అవస్థలు
- అభివృద్ధికి దూరంగా అబ్దుల్లాపురం ఎస్సీ కాలనీ


జగనన్న కాలనీలో రోడ్డు దుస్థితి


అబ్దుల్లాపురం గ్రామంలోని జగనన్న కాలనీ

వెలుగోడు: మండలంలోని అబ్దుల్లాపురం ఎస్సీ కాలనీ పక్కనే పేదలకు గత ప్రభుత్వం నిర్మించిన జగనన్న కాలనీలో కూలమి ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించడం లేదు. ఫలితంగా సమస్యలతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు లేక నానా అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. అడుగు తీసి అడుగు పెట్టేందుకు కూడా వీలుకానంత దుస్థితిలో రోడ్లు ఉండటంతో కాలనీ వాసులు ఆవేదన చెందుతున్నారు. వీధిలైట్లు లేకపోవడంతో రాత్రిళ్లు అంధకారంలో మగ్గుతున్నారు. ఇళ్ల చుట్టూ విష పురుగులు సంచరిస్తున్నాయని భయాందోళన చెందుతున్నారు. సమస్యలను పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా స్పందించడం లేదని వారు వాపోతున్నారు.

సీసీ రోడ్డు నిర్మించాలి



మా కాలనీలో సరైన రోడ్డు లేదు. వర్షం వస్తే చాలు మట్టి రోడ్డు మొత్తం బురదమయం అవుతోంది. ఈ రోడ్డులో నడవాలంటే భయంగా ఉంది. చిన్నపిల్లలు, వృద్ధులు అయితే ఇంట్లో నుంచి బయటకు కూడా రావడం లేదు. సీసీ రోడ్డు నిర్మించాలి. – రూపా, అబద్దుల్లాపురం జగనన్న కాలనీ

రాత్రిళ్లు భయంగా ఉంటుంది



మా కాలనీలో వీధి లైట్లు లేవు. అసలే ఊరి శివారులో ఉంటున్నాం. ఇళ్ల మధ్య పాములు, తేళ్లు తిరుగుతున్నాయి. రాత్రిళ్లు బయటకు రావాలంటేనే భయంగా ఉంటుంది. వీధి లైట్లు ఏర్పాటు చేయాలి. – పుష్పలత, అబద్దుల్లాపురం జగనన్న కాలనీ

వాగు వస్తే రాకపోకలు బంద్!

- ఏటా ఇదే తీరు.. పట్టించుకోని పాలకులు


లింగాపురం శివపురం గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న ఎద్దులేరు


ఎద్దులేరు వద్ద వేచి ఉన్న ప్రయాణికులు, ఉద్యోగులు

కొత్తపల్లి: ఏటా వర్షాకాలంలో దాదాపు 12 గ్రామాల ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. వర్షాలు రావడం వాగు పొంగడం రాకపోకలు స్తంభించడం.. అధికారులు హడావుడి చేయడం ఆ తర్వాత మరిచిపోవడం షరా మామూలే అవుతోంది. శాశ్వత పరిష్కారం చూపాలని ఆయా గ్రామాల ప్రజలు విన్నంచుకుంటున్నా పట్టించుకునే పాలకులు కానీ, అధికారులు కానీ లేకపోవడంతో వారికి ఏటా వాగు కష్టాలు తప్పడం లేదు. మండల పరిధిలోని ఎం.లింగాపురం – శివపురం గ్రామాల మధ్య ఎద్దులేరు పొంగి ప్రవహిస్తోంది. దీంతో శివపురం, సింగరాజుపల్లె, శివపురం గూడెం, బట్టువారిపల్లె, చిన్నగుమ్మడాపురం, పెద్దగుమ్మడాపురం, గుమ్మడాపురం గూడెం, ముసలిమడుగు, ఎర్రమఠం, పాతమాడుగుల, కపిలేశ్వరం, ఎర్రమఠంగూడెం గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోతున్నాయి. వాగు వచ్చిన ప్రతిసారీ ఆయా గ్రామాలలోని పాఠశాలలకు కూడా సెలవులే. భారీ వర్షాల కారణంగా జిల్లా అధికారులు సోమవారం అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించారు. మంగళవారం శివపురం వద్ద వాగు ఉధృతి తగ్గకపోవడంతో ఆర్టీసీ బస్సు కూడా వాగు వద్దకు వచ్చి వెనుతిరిగి పోయింది. ఉపాధ్యాయులు, ప్రభుత్వాధికారులు వాగు వద్ద నిరీక్షించాల్సి వచ్చింది. వాగును దాటకూడదనే రెవెన్యూ, పోలీసు అధికారుల ఆంక్షల మేరకు వారు వెనుతిరిగిపోతున్న పరిస్థితి నెలకొంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఇప్పటికైనా వాగు వద్ద హైలెవెల్ వంతెన ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణుడి ఊరేగింపు


శ్రీకృష్ణుడిని అలకరించిన భక్తులు


శ్రీకృష్ణుడి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

నందికొట్కూరు: శ్రీకృష్ణుడి జయంతి వేడుకల్లో భాగంగా పట్టణంలో మంగవారం శ్రీకృష్ణుడి ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రబోధానంద ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణుడి ఊరేగింపులో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భక్తులు పల్లకీని మోసి పూజలు నిర్వహించుకున్నారు. నిర్వాహకులు వాడాలి వెంకటేశ్వరు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక జీవితాన్ని అలవర్చుకోవాలన్నారు. దైవ చింతన కలిగి ఉంటే ప్రతి పనిలో విజయం సాధించవచ్చన్నారు. శ్రీకృష్ణుడి, గోపికల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు.

తోటలు కాపాడుకోండి


మొక్కలను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారిణి హరిచందన

పాములపాడు: యాజమాన్య పద్ధతులు పాటించి అధిక వర్షాల నుంచి పంటలు కాపాడుకోవాలని ఉద్యాన అధికారిణి హరిచందన రైతులకు సూచించారు. మంగళవారం యర్రగూడూరు గ్రామ సమీపంలోని పసుపు తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాల వల్ల మొక్కలు వాలిపోతే వాటికి మట్టిని ఎగదోయాలన్నారు. వర్షాల కారణంగా పంట నష్టాలను నివారించడానికి 19-19-19 ని 5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆకుమచ్చ, కుళ్లు రోగం రాకుండా కార్బెండజిమ్ గ్రాము లీటరు నీటిలో లేదా మాంకోజెమ్ 3 గ్రాములు లీటరు నీటిలో కిలిపి మొక్క మొదళ్ల వద్ద పోయాలన్నారు. ఉల్లి, మిరప పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆమె వివరించారు.

వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి


మిడుతూరులో రాస్తారోకో చేస్తున్న నాయకులు, రైతులు

నందికొట్కూరు: యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు వెంకటేశ్వరు డిమాండ్ చేశారు. రైతులకు యూరియా అందించాలని కోరుతూ పార్టీ నాయకులు మంగళవారం మిడుతూరు బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 20 రోజుల నుంచి రైతుకు బస్తా యూరియా కూడా సరఫరా చేయలేదన్నారు. వ్యాపారులు మాత్రం యూరియాను బిల్లులో ఒక రేటు నమోదు చేసి రైతుల నుంచి అధికంగా వసూలు చేస్తున్నారన్నారు. ఈ దోపిడీ తతంగం అధికారులకు తెలిసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ధర్నాలో పార్టీ నాయకులు నాగరాజు, సోమన్న, సోమప్ప, స్వాములు, శ్రీరాములు, శ్రీనివాసులు, సుదర్శన్, బీబీ, ముర్తుజాబీ పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి


సబ్ జైలులో రికార్డులను పరిశీలిస్తున్న జడ్జి

నంద్యాల(వ్యవసాయం): క్షణికావేశంలో నేరాలకు పాల్పడి జైలులో ఉన్న ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి, ఉమ్మడి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ లీలా వెంకట శేషాద్రి పేర్కొన్నారు. స్థానిక సబ్ జైలును మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఖైదీల కేసు వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే జైల్లో కల్పిస్తున్న వసతులు సౌకర్యాలపై ఆరా తీశారు. ఖైదీలకు ఏమైనా సమస్యలు ఉంటే న్యాయవాది ద్వారా ఉచితంగా కోర్టులో వాదించడానికి ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జైలు సూపరిటెండెంట్ గురుప్రసాద రెడ్డి, న్యాయవాదులు బాలునాయక్, శేష సాయిబాబా, జీవన్, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్య విభాగం తనిఖీ

పట్టణ శివారులోని శాంతిరాం మెడికల్ కాలేజీ మానసిక వికలాంగుల విభాగాన్ని మంగళవారం సీనియర్ సివిల్ జడ్జి లీల వెంకట శేషాద్రి, లీగల్ సర్వీస్ యూనిట్ ఫర్ మావోనియా కమిటీ సభ్యులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానసిక వికలాంగులకు న్యాయసహాయం అందించేందుకు ఎల్ఎస్ఎం కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం వార్డుల్లో మానసిక వికలాంగులను కలిసి వారి ఆరోగ్యం, హాస్పిటల్ కల్పిస్తున్న వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో శాంతిరాం హాస్పిటల్ ప్రిన్సిపాల్ డాక్టర్ వసంత్, న్యాయవాదులు జీవన్, శేష సాయిబాబా, వైద్యులు సింధు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత ఆత్మహత్య


శిరుప శ్రీనివాసరెడ్డి (ఫైల్)

గడివేముల: మండల పరిధిలోని పెసరవాయి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం మాజీ అధ్యక్షుడు శిరుప శ్రీనివాసరెడ్డి (55) మంగళవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మూడు రోజుల క్రితం నంద్యాలలోని ఆయన నివాసంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. ఈ ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. మృతదేహం డీకంపోజ్ అయ్యింది. ఆత్మహత్యకు గల కారణాలను సూసైడ్ లెటర్ రాసి ఉంచినట్లు సమాచారం. అయితే ఈ విషయాన్ని పోలీసులు వెల్లడించడం లేదు. బంధువుల ఫిర్యాదు మేరకు నంద్యాల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాసరెడ్డి ఆత్మహత్యకు కుటుంబ కలహాలు కారణమా..మరి ఏమైనా ఇతర కారణాలు ఉన్నాయనేది పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది. ఈయన ఏకైక కుమార్తె దివ్య అమెరికాలో ఉన్నారు. భార్యతో విభేదాల కారణంగా కొన్నేళ్లుగా దూరంగా ఉన్నట్లు సమాచారం. శ్రీనివాసరెడ్డి మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డికి వీరాభిమాని. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. దీంతో ఆయన్ను పార్టీ నంద్యాల జిల్లా రైతు విభాగం అధ్యక్షుడిగా నియమించారు. ఆయన మృతిపై కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు.

నీటిని బయటకు పంపాలి

పాములపాడు: అధిక వర్షాల వల్ల వరి పంట నీట ముంపునకు గురైనప్పుడు కాల్వలు తీసి బయటకు పంపాలని మండల వ్యవసాయాధికారి మహేశ్వర రెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం శాంతి నిలయం గ్రామ పరిధిలోని వరి పైరును పరిశీలించారు. కాల్వలు తీసి నీటిని బయటకు పంపిన తర్వాత 20కిలోల యూరియా, 10 కిలోల మ్యూరేట్ అఫ్పొటాష్ బూస్టర్ డోస్‌గా వేసుకోవాలని సూచించారు.

పెన్షన్ రద్దయిన వారు అప్పీల్ చేసుకోవాలి

పాములపాడు: పింఛన్ రద్దయిన వారు, మార్పుతో నోటీసు పొందిన వారు సరైన ఆధారాలతో అప్పీల్ చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అప్పీల్ చేసుకున్న వారికి ఎంపీడీఓ లాగిన్ నుంచి మరోసారి రీ అసిస్మెంట్ నోటీసు జారీ చేస్తామన్నారు. మండలంలోని 93 మందికి నోటీసులు అందజేశామని, అందులో 15 మందికి మార్పు కోసం, 75 మందివి రద్దయినవి ఉన్నాయన్నారు.

మహిళ అదృశ్యం

మహానంది: అబ్బీపురం గ్రామానికి చెందిన సుధారాణి అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. సుధారాణి ఈనెల 18న ఉదయం సరుకులు తీసుకొస్తానని అంగడికి వెళ్లి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లేకపోవడంతో బాధితురాలి మామ తపిల ఓబులేసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

ఫిష్ ఫారానికి పూర్వవైభవం తెస్తాం

జూపాడుబంగ్లా: తంగడంచ ఫారంలో ఉన్న ఫిష్ ఫారానికి త్వరలో పూర్వవైభవం తెస్తామని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ హీరానాయక్ తెలిపారు. ఆక్రమణకు గురైన జూపాడుబంగ్లా ఫిష్ ఫారం భూములను మంగళవారం ఆయన పరిశీలించారు. వీఆర్వో బాలకృష్ణ, ఇన్‌చార్జ్ ఎఫ్‌డీఓ భరత్‌లాల్‌నాయక్‌ను భూముల వివరాలు, సరిహద్దులను తెలుసుకున్నారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌కు ఫోన్‌చేసి సత్వరమే మత్స్యశాఖకు కేటాయించిన భూములను సర్వేచేసి వాటికి సంబంధించిన నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సమగ్ర నివేదికలు సిద్ధం చేసి జిల్లా కలెక్టర్, మత్స్యశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆయన తెలిపారు.

పేర్లు నమోదు చేయించుకోండి

జూపాడుబంగ్లా: అధిక వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్న రైతులు రైతుసేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం మండ్లెం, తంగడంచ గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అధిక వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్న రైతులు ఈక్రాప్ బుకింగ్ చేయించుకుని, రైతుసేవా కేంద్రాల సిబ్బందితో పంటనష్టం ఫొటోలు తీయించుకుని పేర్లు నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు. యూరియా సరఫరా తగ్గినందున రైతులు ప్రత్యామ్నాయంగా నానో యూరియా, నానో డీఏపీలను వినియోగించుకోవాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

డోన్ టౌన్: నియోజకవర్గంలోని డోన్ పట్టణానికి ఒకటి, బేతంచెర్ల నగర పంచాయతీకి మరోటి ఓపెన్ కేటగిరీ కింద కొత్త బార్ల స్థాపనకు గెజిట్ జారీ అయినట్లు డోన్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ వరలక్ష్మీ మంగళవారం తెలిపారు. ఈ లైసెన్సులు మూడేళ్ల కాలపరిమితితో ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. బార్లకు దరఖాస్తు చేసుకోదలచిన వారు రూ.5 లక్షల నాన్ రీఫండబుల్ అప్లికేషన్ ఫీజు చెల్లించి, ఈ నెల 18వ తేదీ నుంచి 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. 28న నంద్యాలలో లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తారన్నారు. వివరాలకు డోన్ ఎక్సైజ్ స్టేషన్ లేదా 9440902584 నంబర్‌ను సంప్రదించవచ్చని సీఐ తెలిపారు.

అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న పలువురు వైద్యులకు ప్రొఫెసర్లుగా పదోన్నతి లభించింది. వారికి కౌన్సెలింగ్ నిర్వహించి వివిధ మెడికల్ కాలేజీలకు బదిలీ చేశారు. వీరిలో డాక్టర్ వైకేసీ రంగయ్య (ఫోరెన్సిక్ మెడిసిన్) శ్రీకాకుళంకు, డాక్టర్ ఇలియాస్ బాషా (ఆర్థోపెడిక్స్) నంద్యాలకు, డాక్టర్ విజయమోహన్‌రెడ్డి (ఆర్థోపెడిక్స్) కడపకు, డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి (పీడియాట్రిక్స్) నంద్యాలకు, డాక్టర్ హరినాథరావు (రేడియాలజీ) నంద్యాలకు పదోన్నతిపై బదిలీ అయ్యారు. వీరిని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్ అభినందించారు.

వదలని వరుణుడు


నిండుకుండలా ప్రవహిస్తున్న భవనాశి నది

ఆత్మకూరు: మండలంలో నాలుగు రోజులుగా వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. మంగళవారం 11.4 మి.మీ. వర్షం కురిసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. సోమవారం 52.8 మి.మీ. భారీ వర్షానికి ఈ వర్షం తోడు కావడంతో వరదలు తగ్గుముఖం పట్టలేదు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న, మెట్ట వరి, పత్తి పంటలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పొలాల్లో వర్షపు నీరు నిలవడంతో కుళ్లిపోయే పరిస్థితి ఉందని రైతులు చెబుతున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టకపోతే భారీ నష్టం జరిగే ప్రమాదం ఉంది. వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో నీటిలో మునిగిన పంట పొలాలపై సర్వేలు నిర్వహిస్తున్నారు. భవనాశి, సుద్దవాగు, పెద్దవాగులు యథావిధిగా పొంగి ప్రవహిస్తున్నాయి. వరదరాజస్వామి ప్రాజెక్టు నిండుకుండలా ఉంది. సిద్ధాపురం చెరువు సైతం అదే స్థాయిలో కళకళలాతోంది. 16 అడుగుల నీటితో జలకళను సంతరించుకుంది.

పంటలకు నష్టపరిహారం ఇవ్వాలి


డీఎఫ్‌ఓ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న రైతుసంఘం, సీఐటీయూ నాయకులు

ఆత్మకూరు: అడవి జంతువుల వల్ల నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వి.యేసురత్నం డిమాండ్ చేశారు. మంగళవారం డీఎఫ్ఓ కార్యాలయం ఎదుట కొత్తపల్లి మండల రైతు సంఘం అధ్యక్షుడు గంగన్న అధ్యక్షతన ధర్నా నిర్వహించి, రేంజర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు, వెలుగోడు మండలాల్లో ఫారెస్టు సమీపంలో ఉన్న గ్రామాల రైతులు సాగు చేసిన మొక్కజొన్న, మినుము, వేరుశనగ, కంది, వరి, సోయాబీన్, జొన్న పంటలను జంతువులు నాశనం చేస్తున్నాయన్నారు. పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. ధర్నాలో ఏపీ రైతు సంఘం కొత్తపల్లి మండల ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు, ఆత్మకూరు రైతుసంఘం మండలాధ్యక్షుడు పి.మాబాషా, సీఐటీయూ నాయకులు రణధీర్, ఆత్మకూరు సీఐటీయూ కార్యదర్శి రామ్‌నాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జెడ్ వెంకటరెడ్డి, రైతులు రామకృష్ణ, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

మహానందిలో భక్తుల సందడి


మహానందీశ్వర స్వామిని దర్శనానికి వెళ్తున్న భక్తులు

మహానంది: శ్రావణమాసం కావడంతో మహానంది క్షేత్రం భక్తులతో కళకళలాడుతుంది. వర్షాలను సైతం లెక్కచేయకుండా భక్తులు మహానందికి వస్తున్నారు. అక్కడికి వచ్చిన భక్తులు మహానందీశ్వర స్వామి దర్శనానికి వస్తుండడంతో భక్తుల సందడి నెలకొంది. భక్తులు కామేశ్వరీ దేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.

నేడు నందీశ్వరుడికి ప్రదోశకాల అభిషేకం

నందీశ్వర స్వామికి బుధవారం ప్రదోషకాల అభిషేకం ఉంటుందని వేదపండితులు బ్రహ్మశ్రీ చెందూరి రవిశంకర అవధాని తెలిపారు. భక్తులు ఆర్జితసేవ టికెట్ల ద్వారా పూజల్లో పాల్గొనవచ్చన్నారు.

జాగ్రత్తలు పాటించకపోతే దిగుబడులపై ప్రభావం


నీటమునిగిన వరిపైరు

- నీటి నిల్వతో పంటలు కుళ్లిపోయే ప్రమాదం
- అధిక తేమతో పూత, కాయ రాలే అవకాశం
- ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ విల్సన్

నంద్యాల(అర్బన్): అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో కురుస్తున్న వర్షాలకు పంటలు జలమయమయ్యాయి. ఐదారురోజులుగా ఈ పరిస్థితి కొనసాగుతుండటంతో పైర్లు కుళ్లిపోయే ప్రమాదం నెలకొంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో నల్లరేగడి నేలల్లో ఎక్కువగా వరి, పత్తి, కంది, మొక్కజొన్న, పెసర, మినుము, తేలిక పాటి ఎర్రనేలల్లో వేరుశనగ పంటలు సాగు చేశారు. నీటి నిల్వ, అధిక తేమ శాతంతో ఆయా పంటలు కుళ్లిపోవడం, పూత, కాయ రాలడం జరుగుతుంది.ఈ ప్రభావం దిగుబడులపై పడుతుందని, ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటే సమస్యను అధిగమించవచ్చునని. ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ విల్సన్ మంగళవారం తెలిపారు. వివిధ పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను ఈ సందర్భంగా ఆయన వివరించారు.

- వరిపైరు ప్రస్తుతం నారుమడి దశ నుంచి నాట్లు వేసిన 20 నుంచి 40రోజుల దశలో ఉంది. బీపీటీ 5205, ఇతర రకాలు మూడు నాలుగు రోజుల వరకు ముంపును తట్టుకుంటాయి.
- నీట మునిగిన పొలాలు పుంజుకోవడానికి నారుమడికి యూరియా, కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ పైపాటుగా వేయాలి. పిలకలు కట్టే దశలో నీరు బయటకు తీసిన వెంటనే ఎకరాకు 20కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ పైపాటుగా వేసుకోవాలి.
- పత్తి పంట 50 నుంచి వందరోజుల దశలో పూత, కాయ ఏర్పడే దశ నుండి మొదటి తీత దశలో ఉంది. పత్తిపంటలో వర్షపునీరు నిలబడితే పిందె, పూత, కాయ రాలిపోవడం, ఆకులు ఎర్రబడి వాడిపోయి రాలిపోవడం జరుగుతుంది.
- పొలంలో నిలబడిన నీటిని తీసి ఎకరాకు 25-30 కిలోల యూరియా, 15-15కిలోల పొటాష్‌ను అదనంగా వేయాలి. వాతావరణం అనుకూలించిన వెంటనే అంతర్ కృషి చేయాలి.
- మినుము పంట ఏపుగా పెరిగే దశ నుంచి కాయ పరిపక్వ దశలో ఉంది. ప్రభావిత పొలాల్లో నిలిచిన నీటిని బయటకు తీసి ఇనుము లోపాన్ని సరి చేయడానికి ఫెర్రర్స్ సల్ఫేట్ 5.0 గ్రాములు, సిట్రిక్ యాసిడ్ 0.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- వారం తర్వాత ఒక శాతం 19:19:19, 1.2 శాతం పొటాషియం నైట్రేట్‌లతో పిచికారీ చేయాలి.
- కాయ ఏర్పడే దశ నుంచి పరిపక్వ దశల్లో వేరు కుళ్లు తెగులు, ఆకుమచ్చ తెగుళ్ల నివారణకు హెక్సాకొనజోల్ 2 మి.మీ., ప్రొపికొనజోల్ ఒక మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- మొక్కజొన్న పంట 50 నుంచి 60 రోజుల దశలో ఉంది. శాకియా, పూత, గింజ ఏర్పడే దశల్లో ఉన్న మొక్కజొన్న పైర్లలో నీరు నిలిస్తే నష్టం తీవ్రంగా ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ 48 గంటల్లో పొలాల్లో నిలిచిన నీటిని తీసివేయాలి. ఆ తర్వాత పంటపై 2శాతం యూరియా(హెక్టార్లకు 10 కిలోలు, ఒక శాతం పొటాషియం నైట్రేట్‌ను), హెక్టార్‌కు 5 కిలోలు పిచికారీ చేయాలి. అవకాశాన్ని బట్టి డ్రోన్‌ల సాయంతో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారీ చేయాలి.